2.22 లక్షల పరీక్షలు.. 82 వేల అద్దాల అందజేత

● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



అద్దాలు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: నగరంలో కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడీహెచ్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. హైదరాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 2.22లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 82,365 మందికి కంటి అద్దాలు అందజేయడం జరిగిందని వివరించారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్యరంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసి భారీ ఎత్తున బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని అయితే కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కళ్లను పరీక్షించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటితో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య ఆరోగ్య సేవలను గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం రమణారెడ్డి పాల్గొన్నారు.

◆ ఐడీహెచ్ కాలనీలో రేణుకాఎల్లమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భూమిపూజ నిర్వహించారు. అదే విధంగా బండమైసమ్మనగర్‌లో నిర్మిస్తున్న ఆర్చి పనులను పరిశీలించారు.

క్లుప్తంగా...

డైరీ ఆవిష్కరణ

చిలకలగూడ: తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర డైరీని మంగళవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల కోసం సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని పద్మారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మోహన్ నాయక్, రమేష్, సాయిలక్ష్మీయాదవ్, వాణి, మంజుల, శ్యామల, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సాయికృతిక ఎంపిక



సనత్‌నగర్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల సనత్‌నగర్ ఓల్డ్ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సాయికృతిక మేడ్చల్ జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైంది. బాలానగర్ మండల స్థాయిలో నిర్వహించిన టెస్ట్‌లో ఆమె ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీకి అర్హత సాధించింది. ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి సాయికృతిని అభినందించారు.

యూపీహెచ్‌సీ నిర్మాణానికి సహకరించండి



తహసీల్దార్ అయ్యప్పతో సమావేశమైన కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ వారాసిగూడలో అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణానికి సహకరించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్పను కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలంలో యూపీహెచ్‌సీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, రెవెన్యూ శాఖ నుంచి తగిన అనుమతులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

వినికిడి లోపాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

రాంగోపాల్‌పేట్: చిన్న వయసులోనే పిల్లల్లో వినికిడి లోపాలను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలని, వాటిని నిర్లక్ష్యం చేస్తే అనేక సమస్యలు వస్తాయని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ చైర్మన్ అజయ్ మిశ్రా తెలిపారు. మినిస్టర్ రోడ్‌లోని హియర్ ఎన్ సే క్లినిక్ 9వ వార్షికోత్సవ సందర్భంగా వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు ఆశిష్, ఆనంద్, సాయి కృష్ణ, గరిమ వేగివాడ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఏర్పాటుకు వినతి

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లోని కమాన్ ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బస్తీవాసులు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అభ్యర్థనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పద్మారావు గౌడ్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి, తార్నాక టీడీపీ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎ.శ్రీనివాస్, ఆలకుంట లింగం, బీజేపీ నాయకులు గండికోట నర్సింహ, బస్తీ పెద్దలు ఉన్నారు.

క్రీడాకారులకు జెర్సీల అందజేత



కంటోన్మెంట్: ఫిస్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం తగిన సహకారం అందించాలని అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు. తమిళనాడులోని నాగర్ కోయిల్‌లో ఈ నెల 17 నుంచి జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్లకు మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జెర్సీలు అందజేశారు. బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర జట్టు సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, కొమ్ము వెంకట్, ప్రభు కుమార్ గౌడ్, హోప్ విజయ్, విక్రమ్ సిన్హా, రఘు చరణ్ పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మపై బోధన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిజాం నవాబు పాలన కాలంలో మంత్రిగా పని చేసిన భాగ్యరెడ్డి వర్మ గురించి అధ్యాపకుడు ప్రొ.కాశీం బోధించారు. మంగళవారం వామపక్ష, దళిత, స్వేచ్ఛ జేఏసీ, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.కాశీం 45 నిమిషాలు వివిధ అంశాలపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్ మూర్తి, రఘునాయక్, సత్య, సుమంత్ పాల్గొన్నారు.

'మనుస్మృతి గ్రంథంతో జాతి విచ్ఛిన్నం'



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: మనుస్మృతి గ్రంథంతో భారతజాతి విచ్ఛిన్నమవుతుందని బహుజన విద్యార్థి సంఘాల (బీఎస్ఎఫ్) నేతలు పేర్కొన్నారు. నేడు హిమాయత్‌నగర్ జరిగే మనుస్మృతి గ్రంథ ఆవిష్కరణ సభకు అనుమతి ఇవ్వొద్దంటూ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ మాట్లాడుతూ.. మనుస్మృతి ఆధారంగా పూర్వం దేశాన్ని పాలించి మన పాలకులు విఫలమై పరాయి చేతిలోకి వెళ్లిన విషయం గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో దేశంలో అన్ని వర్గాలు శాంతియుతంగా జీవిస్తున్న తరుణంలో మళ్లీ మనుస్మృతి లాంటి ప్రాచీన గ్రంథాలను పునరుద్ధకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి విద్య ద్వారా సాధించిన శాస్త్రీయత, సాంకేతికత తద్వారా ఆర్థిక ప్రగతి, సామాజిక సమానత్వం పక్కనపెట్టి ఆధునిక శాటిలైట్ యుగంలోను మనుస్మృతి గ్రంథాన్ని ప్రోత్సహించడం అర్థరహితమన్నారు. కుల, మతాల నడుమ చిచ్చుపెట్టే మనుస్మృతి గ్రంథాన్ని భారత ప్రభుత్వం నిషేధించాలని డిమాండ్ చేశారు. మనుస్మృతి గ్రంథావిష్కరణ సభ నిర్వాహకులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ రమేష్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. తిరుపతి, అంబేడ్కర్, దర్శన్, హర్షద్, నందీప్, శివ,సుశాంత్, ఆనంద్ కుమార్, సత్యం, దిలీప్, రాజేష్ పాల్గొన్నారు.

పార్టీని వీడి వెళ్లిన వారికి కోవర్టుల్లా వ్యవహరించడం తగదు



విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

సనత్‌నగర్: కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులమని చెబుతూనే ఆ పార్టీని వీడిన మర్రి శశిధర్ రెడ్డి వెంట తిరుగుతూ ఆయనకు కోవర్టుల్లా వ్యవహరించడం తగదని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌నాయక్ ఆరోపించారు. సనత్‌నగర్‌లో పలువురు నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో నిఖార్సయిన నాయకులుగా కొనసాగాలే తప్ప, కాంగ్రెస్‌లో కొనసాగుతూ ఆ పార్టీని వీడి వెళ్లిన వారి వెంట వెళ్లడం ఎంతవరకు భావ్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చేలా కొంతమంది వ్యవహరిస్తున్నారని ఈ విషయాన్ని అధిష్ఠానం వద్దకు తీసుకుకెళ్తామన్నారు. సమావేశంలో రాపోలు ఎలీషా, గంగాధర్‌గుప్తా ఉన్నారు.

'విలీనంతోనే కంటోన్మెంట్ అభివృద్ధి'



బోయిన్‌పల్లిలో పర్యటిస్తున్న వికాస్ మంచ్ సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్ఎంసీలో విలీనం అయితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) నేతలు పునరుద్ఘాటించారు. ఈ మేరకు విలీనంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ 'మెర్జర్ వాక్' పేరిట మంగళవారం ఒకటో వార్డు పరిధిలో పలు బస్తీల్లో పర్యటించారు. కడక్‌పురా, కమిషరీ బజార్, పెన్షన్‌లైన్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి విలీనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతకు ముందు బోయిన్‌పల్లి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తూ పర్యటన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు సిరాజ్ ఖాన్, హమీద్, లక్ష్మణ్, శ్రీనివాస్, మహ్మద్ షఫీ, సయ్యద్ సాజిద్, వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం అబెల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, ఎలకంటి ప్రభుగుప్తా, అరుణ్ యాదవ్, బల్వంత్ రెడ్డి, మహమ్మద్ ఫసి పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు పింఛన్లు మంజూరు చేయాలి




వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో వేల మంది దరఖాస్తు పెట్టుకున్నారని, కాని అవి ఆరు నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. పింఛన్ల మంజూరుకు ఇప్పటికే అనేక మార్లు ఆందోళనలు చేసినప్పటికీ అధికారులలో స్పందన లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మారేడుపల్లి తహసీల్దార్ మాధవి రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో యాదగిరి, రంజిత్ సింగ్, ఎస్.కే. ఖాజా, డేవిడ్, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ పాలనే

ప్రజాగోస–బీజేపీ భరోసాలో మర్రి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ఏ ఆకాంక్షలతోనైతే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామో ఆ ఆకాంక్షలకు విరుద్ధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం బేగంపేట డివిజన్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మోసపూరిత మాటలతో వారిని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని, కేసీఆర్ మాటలను ఇప్పటి వరకు ప్రజలు నమ్మారు కానీ.. ఇకపై నమ్మే పరిస్థితి లేదన్నారు. దళితబంధు పేరిట కమీషన్లు దండుకోవడమే సరిపోతుందని, బీఆర్ఎస్ పార్టీకి చెందిన అర్హత లేని వారికి లబ్ధి చేకూరుస్తున్నారన్నారని ఆరోపించారు. బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ, ఎస్పీటీనగర్‌లలో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు నిర్మించి తొమ్మిదేళ్లు గడిచినా వాటిని లబ్ధిదారులకు కేటాయించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగినా వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పరచుకుని తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, శ్రీశైలంగౌడ్, రవీందర్, మిథున్‌జైన్ పాల్గొన్నారు.

వినోభానగర్‌లో..

లాలాపేట: ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బండ కార్తీకరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వినోభానగర్‌లో జరిగిన ప్రజా గోస–బీజేపీ భరోసాలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపించడానికి దోహదపడుతాయన్నారు.

సమాచారం

టీఎస్‌సెట్-2022 వాయిదాకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: మార్చి 13 నుంచి ప్రారంభంకానున్న టీఎస్‌సెట్‌ను-2022 వాయిదా వేయాలని సభ్యకార్యదర్శి ప్రొ.మురళీకృష్ణకు మంగళవారం డీబీఎస్‌ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. చదువుకునేందుకు ప్రస్తుతం ఇచ్చిన నెల రోజుల సమయం సరిపోదని, మరో నెల వాయిదా వేయాలని వినతిలో పేర్కొన్నారు.

నేడు మంత్రి, అధికారులు పర్యటన

సనత్‌నగర్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పర్యటనలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని పేద ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలను పరిశీలిస్తారు. బన్సీలాల్‌పేట డివిజన్‌లోని సోమప్ప మఠం, బన్సీలాల్‌పేట ట్రస్ట్, రాంగోపాల్‌పేట డివిజన్‌లోని జీరా గార్డెన్, ఆర్‌పీ రోడ్డులోని పెద్దమ్మ టెంపుల్, మినిస్టర్ రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద గల వెంగళరావునగర్, సనత్‌నగర్ డివిజన్‌లోని శ్యామలకుంట ప్రాంతాల్లో పర్యటిస్తారని అధికారులు పేర్కొన్నారు.

న్యాయశాస్త్రం ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో గత అక్టోబరు, నవంబరు నెలల్లో జరిగిన వివిధ న్యాయశాస్త్రం కోర్సుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ 3 సం., బీఏఎల్ఎల్‌బీ 5సం., బీబీఏ ఎల్ఎల్‌బీ 5సం. బీకాం ఎల్ఎల్‌బీ 5 సం., కోర్సుల ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఎంసీఈఎంఈ సందర్శన

రసూల్‌పురా: తిరుమలగిరిలోని మిలిటరీ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ) కాలేజీను మంగళవారం లెఫ్టినెంట్ జనరల్ (ఏవీఎస్ఎం, వీఎస్ఎం) అజయ్ కుమార్ సింగ్ సందర్శించారు. ఎంసీఈఎంఈలో శిక్షణలో అనుసరించే ఉత్తమ పద్ధతులు, వినూత్న శిక్షణ కార్యక్రమాలు, అత్యాధునిక శిక్షణ ల్యాబ్‌లు, వివిధ ఫీల్డ్ ఆర్మీ ఓరియెంటెడ్ ప్రాజెక్టులపై కమాండెంట్ ఎంసీఈఎంఈ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ జీఎస్. సిదానా అజయ్‌సింగ్‌కు వివరించారు. ఎంసీఈఎంఈ శిక్షణ ఉన్నత ప్రమాణాలను అజయ్‌సింగ్ ప్రశంసించారు.

అమరులకు ఘన నివాళి



రాంగోపాల్‌పేట్: పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉగ్రవాదులు దొంగచాటుగా జవాన్లను పొట్టనబెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మన ఆర్మీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తెల్లి హరివర్ధన్‌గౌడ్, బాలుయాదవ్, శివకుమార్, నరేష్ పాల్గొన్నారు.

లాలాపేటలో హెల్త్ మేళా

లాలాపేట: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మంగళవారం లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం (యూహెచ్‌పీ తుకారాంగేటు,లాలాపేట)లో హెల్త్ మేళాలను నిర్వహించారు. ఇందులో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్, టెలీ మెడిసిన్, ఎన్‌సీడీ, టీబీ, లెప్రసీ, డీవార్మింగ్ వివిధ రకాలైన వైద్య సదుపాయాలను తెలియజేసేలా పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు గర్భిణులకు యోగా, మహిళలకు జుంబా నృత్యం తదితర అంశాలను టీవీల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, లాలాపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మెడికల్ కిట్‌ను అందజేస్తున్న డాక్టర్ సాయి శంకర్

అడ్డగుట్ట: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మంగళవారం అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ మేళా నిర్వహించి బ్రెస్ట్ కేన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీహెచ్ఓ రాజశ్రీ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రతినెల 14న ప్రజారోగ్య దృష్ట్యా హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గర్భిణు లు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర రోగులకు ఆరో గ్య రక్షణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. నిత్యం యోగా, సైక్లింగ్ చేయడం గర్భిణులకు ఎంతో మంచిదని సూచించారు. అనంతరం, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ శోభన కేన్సర్‌కు గురయ్యే వారికి ప్రథమంగా వచ్చే లక్షణాలను వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన వ్యాయామాల గురించి వివరించారు. 58 మంది మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్, 36 మందికి షుగర్ పరీక్షలు, ముగ్గురికి టీబీ పరీక్షలు నిర్వహించారు.

ఆరోగ్య ర్యాలీ..

సనత్‌నగర్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అమీర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అమీర్‌పేట ఆరోగ్య క్లస్టర్ సీనియర్ అధికారిణి డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో స్థానిక యూపీహెచ్‌సీలో స్థానికులు, రోగులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, సంక్రమిక జబ్బులు, పౌష్టికాహార లోపం ,యోగా ఉపయోగాలు తదితర అంశాల్లో వైద్య సిబ్బంది అవగాహన కలిగించారు. అనంతరం కార్పొరేటర్ కేతినేని సరళ పర్యవేక్షణలో స్థానిక ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.

మైనర్లు వాహనాలు నడిపితే పేరెంట్స్ జైలుకు

● ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రసూల్‌పురా: మైనర్లు వాహనాలు నడిపిస్తే వారితో పాటు తల్లిదండ్రులూ జైలుకు వెళ్తారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు తెలిపారు. తిరుమలగిరి మండలం మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన లేకపోవడం, సరైన మార్గదర్శకాలు పాటించకపోవడం అతి వేగం, మద్యంమత్తులో డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్, ద్విచక్ర వాహనాలపై వెళ్తే హెల్మెట్ ధరించాలన్నారు. కూడళ్లలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను అనుసరించాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాద సంఘటనల వీడియోలను ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పద్మావతి, వీరమ్మ, పాఠశాల హెచ్ఎం ఐరీన్ సుప్రద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కృషి



మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

కంటోన్మెంట్: సంచార జాతుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తగిన సహకారం అందేలా చూస్తానని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటపెల్లి వీరస్వామి వీరభద్రీయ ఆధ్వర్యంలో మంగళవారం మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. ఎంబీసీ కార్పొరేషన్ పరిధిలోని సంచార జాతులకు డబుల్ బెడ్రూమ్‌లు, గురుకులాల్లో 5 శాతం రిజర్వేషన్, ఉపకార వేతనాల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.300 కోట్లు రుణాల రూపంలో అందేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని తెలిపారు. సంచార జాతుల విజ్ఞప్తిని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో పాండు, శ్రవంత్, లక్షణ్ రావు, నరసింహ, శ్రీనివాస్, రాజు, అబ్బులింగం, వివేక్, వెంకటయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరిస్తా



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఐదో వార్డు వాల్మీకినగర్ బస్తీలో తాగునీటి సమస్య తీవ్రం కావడంతో పరిష్కారం కోసం బోర్డు అధికారులతో మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. స్థానిక నేత రావుల సతీష్ ఆధ్వర్యంలో తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్‌ను సాయం చేయాల్సిందిగా కోరారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో సత్వర పరిష్కారం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించిన గజ్జెల నాగేశ్ సొంత నిధులతో మంగళవారం బోర్ వేయించారు. త్వరలోనే మోటారు పంపు సెట్ కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బస్తీవాసులు అడిగిన వెంటనే బోర్ వేయించానని తెలిపారు. రావుల సతీష్, శ్రీనివాస్, నరేష్, మారుతి, శ్రీకాంత్, బస్తీ వాసులు నరేష్ గౌడ్, కృష్ణ, కిష్టయ్య, శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.